సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
బుధవారం
03-09-2025
పేజీలు: 02


# రామన్న వారితో జాగ్రత్త..

# కవిత సంచలన వ్యాఖ్యలు

## ఎమ్మెల్సీ పదవికి రాజీనామా



"నాన్న మీ చుట్టూ ఏదో జరుగుతుంది.. నేను కూడా మీలాగే ముఖం మీద మాట్లాడుతా' బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ కు గురైన కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె తన ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ఆమె ప్రకటించారు.హైదరాబాద్ లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ మేరకు తన నిర్ణయాన్ని వెలువరించారు. తన రాజీనామా లేఖలను మీడియా ముఖంగా చూపించారు.

మళ్లీ హరీశ్ రావుపై నిప్పులు చెరిగిన కవిత

ఈ సందర్భంగా కవిత మాజీ మంత్రి హరీశ్ రావుపై ఆమె నిప్పులు చెరిగారు. హరీశ్ రావు సీఎం రేవంత్ రెడ్డికి లొంగిపోయారని ఆరోపించారు. రేవంత్,హరీశ్ ఇద్దరూ ఒకే విమానంలో ఢిల్లీకి వెళ్లారని.. ఆ ప్రయాణంలో రేవంత్ కాళ్లను హరీశ్ పట్టుకున్నారని చెప్పారు. ఆ ప్రయాణం తర్వాత హరీశ్ పూర్తిగా మారిపోయారని రేవంతు లొంగిపోయారని, ఆ తర్వాతే కుట్రలకు తెరలేసిందని కవిత ఆరోపించారు.

కేసీఆర్, కేటీఆర్లను దెబ్బతీసి పార్టీని చేజిక్కించుకునే కుట్ర

రామన్నా.. హరీష్, సంతోష్ మీతో ఉన్నట్టు కనిపించవచ్చు కానీ.. మీ గురించి, తెలంగాణ గురించి ఆలోచించే వ్యక్తులు కాదు అన్నారు కవిత. వాళ్లను పక్కనపెడితేనే పార్టీ బతుకుతుంది. నాన్న పేరు నిలబడుతుంది అంటూ బాంబు పేల్చారు కవిత. ప్రాణం పోయినా కేసీఆర్, కేటీఆర్ లకు హాని చేయనని అన్నారు.

అన్నయ్య అంటూనే సూటి ప్రశ్నలు

అన్నయ్య నాకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని చెప్పాను. చెప్పి చాలా రోజులైనా వర్కింగ్ ప్రెసిడెంట్ స్పందించరా? బంధుత్వం పక్కన పెట్టండి.. మహిళా ఎమ్మెల్సీ బాధపడితే అడగరా అన్నా? అంటూ కేటీఆర్ను ప్రశ్నించారు కవిత. కూరలో ఉప్పు, చెప్పులో రాయి వంటి వాడు సంతోష్ అని తీవ్రవ్యాఖ్యలు చేశారు కవిత. రేవంత్ రెడ్డి ఏనాడు హరీశ్ రావును విమర్శించడని, కేవలం కేసీఆర్, కేటీఆర్ లనే విమర్శిస్తారని అన్నారు కవిత.

మా కుటుంబం బలహీనంగా ఉంటే వారికి అధికారం

పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్లు, వ్యక్తిగత లబ్ధి పొందాలనుకునే వాళ్లు మేం ముగ్గురం కలిసి ఉండకూడదని ఇలా కుట్రలు చేశారని కవిత ఆరోపించారు.

"మా కుటుంబం బలహీనంగా ఉంటే వారికి అధికారం వస్తుంది. మొదటి దశలో నన్ను బయటకు పంపించారు. అదిక్కడితో ఆగదు. నాన్నా (కేసీఆర్), మీ చుట్టూ జరుగుతున్న వాటిని గమనించండి. రేపటి రోజు ఇదే పరిస్థితి రామన్న (కేటీఆర్)కు, మీకూ ఎదురవుతుంది. భారత రాష్ట్ర సమితిని హస్తగతం చేసుకునే కుట్రలో నన్ను బయటకు పంపించారు" అని ఆమె పేర్కొన్నారు.

అవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలా?

అక్రమ కేసులు పెట్టి తిహాడ్ జైలులో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గతేడాది నవంబర్ 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత తెలిపారు.

గురుకులాల సమస్య, బీసీ రిజర్వేషన్లు,మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందించే పోస్ట్ కార్డు ఉద్యమం మొదలైనవి చేశాం.

తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చినపుడు గళమెత్తినట్లు చెప్పారు.

బనకచర్ల, భద్రాచలం సమీపంలోని ముంపు గ్రామాల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాము.

సీఎం సొంత జిల్లాలో భూనిర్వాసితులకు మద్దతుగా ఉన్నాం. 47 నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను కలిపి, అనేక ప్రజాసమస్యలను పరిష్కరించడానికి గులాబీ కండువలతో మాట్లాడాము.

ఈ కార్యక్రమాలు పార్టీ వ్యతిరేకం అవుతాయా?" అని ప్రశ్నించారు. ఆమె ఈ అంశంపై BRS పెద్దలు పునరాలోచన చేయాలని సూచించారు.

హరీశ్‌రావు, సంతోష్ ఇళ్లలో బంగారం ఉంటే బంగారు తెలంగాణ అవుతుందా?

"కాంగ్రెస్ వ్యతిరేకంగా బీసీ అంశంపై మాట్లాడినప్పుడు,పార్టీ వ్యతిరేకంగా మాట్లాడుతున్నట్లు చిలువలు పలువలుగా ప్రచారం చేశారు.

సామాజిక తెలంగాణకు అంకితభావంతో ఉంటానని నేను చెప్పాను.ఇందులో తప్పేముందు? నా తండ్రి కేసీఆర్ (KCR) చిటికెన వేలు పట్టుకుని నేర్చుకున్నా. ఆయన స్ఫూర్తితోనే సామాజిక తెలంగాణ గురించి మాట్లాడాను.


స్వతంత్ర భారతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన నాయకుడు కేసీఆర్. ఆయన చెప్పిన విధంగా ఆచరణలోకి తెచ్చారు. ప్రతి కులాన్ని రక్షించడానికి ప్రయత్నించారు.ఇది సామాజిక తెలంగాణకాదా?నేను తప్పు చెప్పానా? సామాజిక తెలంగాణ BRSకి అవసరమే కాదా?భౌగోళిక తెలంగాణతో బంగారు తెలంగాణ అవుతుందా?

హరీశ్‌రావు,సంతోష్ ఇళ్లలో బంగారం ఉంటే బంగారు తెలంగాణ అవుతుందా?" అని ఆమె ప్రశ్నించారు.



## సీబీఐకి సుగాలి ప్రీతి కేసు!

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కర్నూలు జిల్లాకు చెందిన మైనర్ బాలిక సుగాలి ప్రీతి అనుమానాస్పద మృతి కేసును సీబీఐకి అప్పగించాలని నిర్ణయించింది. ఈ కేసుపై మంగళవారం నాడు ఏపీ సీఎం చంద్రబాబు సమీక్షించారు. అనంతరం ఈ కేసు దర్యాప్తును మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని సీబీఐ అధికారులకు లేఖ రాయాలని సూచించారు. కర్నూలులోని పాఠశాల వసతీగృహంలో 2017 ఆగస్టు 18వ తేదీన సుగాలి ప్రీతి సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ కేసును 2019లో వైసీపీ ప్రభుత్వం సీబీఐకి అప్పగించారు. 8 నెలలు గడిచిన తర్వాత కూడా దర్యాప్తు ప్రారంభం కాకపోవడంతో సుగాలి ప్రీతి తల్లిదండ్రులు 2020లో ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. సీబీఐని వివరణ అడిగింది. దానికి ఈ కేసు దర్యాప్తు చేసేందుకు తమ దగ్గర తగినన్ని వనరులు లేవని సీబీఐ సమాధానమిచ్చింది. ఈ క్రమంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సహా ఈ కేసుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సార్వత్రిక ఎన్నికల ముందును తమ ప్రచారం కోసం చాలా వాడుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కేసును దర్యాప్తు చేయిస్తామని చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఎలాంటి పురోగతి లేదని పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై సుగాలి ప్రీతి తల్లి తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించడం గమనార్హం.




## రామయ్యపల్లిలో యూరియా కోసం ఆధార్ కార్డులు క్యూలో పెట్టిన రైతులు

పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలంలో రైతులకు యూరియా వెతలు తీరడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు యూరియా పంపిణీ కోసం క్షేత్రస్థాయిలో గ్రామాలలో ఏర్పాటు చేసినప్పటికీ.. ఆ స్థాయిలో రైతులకు యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారు. ధర్మారం మండల పరిధిలోని రామయ్యపల్లిలోని డీసీఎంఎస్ కేంద్రానికి 270 యూరియా బస్తాలు కేటాయించారు. యూరియా కేంద్రానికి రావడంతో బుధవారం తెల్లవారుజామునే రైతులు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఆధార్ కార్డులు, పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్ ప్రజలను క్యూ లైన్ లో పెట్టి రైతులు అక్కడే వేచి ఉన్నారు.270 బస్తాల యూరియా కేంద్రంలో ఉన్నప్పటికీ అవి సరిపోవని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సరిపడా యూరియా తెప్పించి ఇబ్బందులు తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## నెల్లూరు లేడీ డాన్ నిడిగుంట అరుణ మెడకు ఉచ్చు



మరింత బిగుస్తోంది.. ఆమెపై వరస కేసులు నమోదవుతున్నాయి.. తాజాగా.. మరో కేసు నమోదవ్వడం కలకలం రేపుతోంది. నెల్లూరుకు చెందిన అరుణపై మరో కేసు నమోదైంది.. అన్నదమ్ముల ఆస్తివివాదంలో తలదూర్చి గన్‌తో తనను బెదిరించారని బాధితుడు శశికుమార్ ఫిర్యాదు మేరకు.. నవాబుపేట పోలీసులు అరుణపై కేసు నమోదు చేశారు. అరుణ అనుచరులు అరుగురిని విచారించిన కోవూరు పోలీసులు.. మరిన్ని వివరాలు సేకరించారు. అరుణ దందాలపై ఆమె అనుచరులు పల్లం వేణు, అంకిం రాజా, షేక్ అఫ్సర్, షేక్ మునీర్, మచ్చకర్ల గణేష్, ఎలిషాలను కోవూరు CI సుధాకర్ రెడ్డి విచారించారు. అరుణతో కలిసి చేసిన నేరాలు, బెదిరింపులు, దందాల గురించి ఆరాతీశారు. కాగా.. ఇప్పటికే సాయి అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌ను ఆక్రమించిన కేసులో అరుణతో పాటు మరో ఆరుగురిని అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్‌కి పంపించారు. కోర్టు14 రోజుల రిమాండ్ విధించగా.. రేపటితో ముగియనుంది.. దీంతో పోలీసులు మళ్లీ ఆమెను అదుపులోకి తీసుకుని విచారించే అవకాశం ఉంది. నెల్లూరు జిల్లా కోవూరు పరిధిలోని పడుగుపాడుకు చెందిన బిల్డర్‌ను బెదిరించిన కేసులో ఈ నెల 19న ఆమె అరెస్ట్ అయింది. రౌడీషీటర్ శ్రీకాంత్ గ్యాంగ్‌తో ఉన్న సంబంధాలు.. వారిని అడ్డం పెట్టుకుని చేసిన దందాలు గురించి పోలీసులు ఇప్పటికే వివరాలు సేకరించారు. ప్రధానంగా.. గూడూరు, సూళ్లూరుపేట, నెల్లూరు రూరల్‌లో దందాలు, దౌర్జన్యాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడినట్లు పోలీసుల దగ్గర పక్కా సమాచారం ఉండడంతో వాటి ఆధారంగా మరిన్ని వివరాలు రాబట్టేందుకు కోవూరు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.




## సెప్టెంబర్ 11న ఓటీటీలోకి కూలీ

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'కూలీ' ఆగస్టు 14న థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని సాధించింది. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం, బాక్సాఫీస్ దగ్గర రూ.500 కోట్ల రూపాయల వసూళ్లు రాబట్టింది. అయితే, ఈ సినిమా 1000 కోట్ల క్లబ్‌లో చేరుతుందని ఊహించినా, ఆ స్థాయికి చేరుకోలేకపోయింది. వీక్ రైటింగ్ కారణంగా ఈ చిత్రానికి అనుకున్న స్థాయి కలెక్షన్స్ రాలేదు. రజనీకాంత్‌తో పాటు సౌబిన్ షాహిర్, రచితా రామ్ పాత్రలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమా ఓటీటీలో ఎప్పుడెప్పుడు స్ట్రీమింగ్ అవుతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో పొందింది. దీంతో ఈ నెల 11వ తేదీ నుంచి కూలీ చిత్రం స్ట్రీమింగ్ అవుతుందనే టాక్ కోలీవుడ్ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో నాగార్జున, శ్రుతి హాసన్, ఉపేంద్ర, సత్యరాజ్, అమీర్ ఖాన్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించాడు.



## వరద సాయం రూ.200 కోట్లు

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రంలోని ప్రధాన రహదారులు, భవనాలు, చెరువులు, కుంటలు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వరదసాయం కింద పలు జిల్లాలకు రూ.200 కోట్లు నిధులను మంజూరు చేసింది. భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన 7 జిల్లాలకు గాను రూ.10 కోట్లు, సాధారణ నష్టం వాటిల్లిన 26 జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పన నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు సిఎస్ రామకృష్ణా రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని, పరిహారాలను వెంటనే విడుదల చేయాలని వారికి సూచించారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## శ్రీదేవి మరణంపై జాన్వీకపూర్ భావోద్వేగం..!

బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాన్వీకపూర్ తన తల్లి, దివంగత నటి శ్రీదేవి మృతిని గుర్తు చేసుకుంటూ చేసిన భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేసింది. ఒక ఇంటర్వ్యూలో జాన్వీ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా ఆమె తన కుటుంబం ఎదుర్కొన్న బాధలు, అవమానాలను ఇంటర్వ్యూలో వివరించారు. 'ఒకానొక సమయంలో మా కుటుంబ సభ్యులను మనుషుల్లా కూడా చూడలేదు. మమ్మల్ని ఏదోలా చూశారు. కొందరు మా మీద బురద జల్లాలని ప్రయత్నించారు. ఎవరూ సానుభూతి చూపలేదు' అని ఆవేదన వ్యక్తం చేసింది. నేను నవ్వితే తప్పు, సైలెంట్‌గా ఉంటే మౌనంగా ఉందని వ్యాఖ్యానించేవారు' అంటూ మీడియా వ్యవహారశైలిపై జాన్వీ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. జాన్వీ కపూర్ తల్లి మృతి తర్వాత నటనా వారసత్వాన్ని కొనసాగిస్తూ.. కష్టపడుతూ తన సినీ ప్రయాణాన్ని జాన్వీ కొనసాగిస్తున్నది. ఇటీవల 'పరమ్ సుందరి' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన జాన్వీ.. ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'సన్నీ సంస్కారి కీ తులసీ కుమారి' సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నది. ఈ మూవీ అక్టోబర్ 2న విడుదల కానున్నది. అదే సమయంలో తెలుగులో రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటిస్తున్నది. ఈ చిత్రానికి బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా 2026 మార్చి 27న విడుదల కానున్నది.




## టిసిఎస్ ఉద్యోగుల వేతనాలు 7శాతం పెంపు

ఉద్యోగుల తొలగింపు వేళ దిగ్గజ ఐటి సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ ఏడాది ఉద్యోగుల వేతనాలను సుమారు 4.5 శాతం నుంచి 7 శాతం వరకు పెంచనున్నట్టు ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రెండు అంకెల పెంపు అంటే 10 శాతం మేరకు ఉంటుందని కంపెనీ తెలిపింది. వేతనాల పెంపు ఈ నెల అంటే సెప్టెంబర్ నుంచి అమల్లోకి రానుంది. ఈ నెల చివర్లో జమయ్యే వేతనంలో సవరించిన జీతం ఉద్యోగులకు అందుతుంది.ఈ పెంపు గత కొన్నేళ్లుగా ఇతర ఐటి సంస్థలు అమలు చేసిన ప్రమాణాలతో సమానంగా ఉన్నాయని సంస్థ తెలిపింది. సాధారణంగా టిసిఎస్ ఏప్రిల్‌లో వేతన పెంపులు ప్రకటిస్తుంది. కానీ ఈ సంవత్సరం ప్రతికూల పరిస్థితులు, అనిశ్చితి కారణంగా వాయిదా వేసింది. జూలైలో త్రైమాసిక ఫలితాలను వెల్లడించినప్పుడు కూడా ఇదే విధానాన్ని కొనసాగించింది. కానీ గత నెలలో వేతన పెంపును అధికారికంగా ధృవీకరించింది. టిసిఎస్‌లో ట్రైనీలు వై గ్రేడ్‌లో ఉంటారు. అనంతరం సి1 (సిస్టమ్స్ ఇంజనీర్), తరువాత సి2, సి3 (ఎ, బి), సి4, సి5, సిఎక్స్‌ఒ స్థాయిలు ఉంటాయి.




## టీ20లకు స్టార్క్ వీడ్కోలు

ఆస్ట్రేలియా దిగ్గజ పేసర్ మిచెల్ స్టార్క్ టీ20 కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 35 ఏండ్ల ఈ పేసర్.. టెస్టులు, వన్డేలలో కెరీర్‌ను కొనసాగించేందుకు గాను టీ20ల నుంచి తప్పకుంటున్నట్టు తెలిపాడు. మరో ఆరు నెలల్లో భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించాల్సి ఉన్న టీ20 ప్రపంచకప్‌నకు ముందు స్టార్క్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పొట్టి ఫార్మాట్‌లో 2012లో అరంగేట్రం చేసి ఆసీస్ తరఫున 65 మ్యాచ్‌లు ఆడిన స్టార్క్.. 7.74 ఎకానమీతో 79 వికెట్లు పడగొట్టాడు. ఈ ఫార్మాట్‌లో అతడు ఆస్ట్రేలియా నుంచి అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ (జంపా 103 మ్యాచ్‌లలో 130 వికెట్లతో మొదటి స్థానం) గా ఉన్నాడు. నవంబర్‌లో ఇంగ్లండ్‌తో మొదలుకాబోయే యాషెస్ సిరీస్, భారత్‌తో టెస్టు సిరీస్‌లకు తోడు 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడేందుకు సన్నద్ధమవుతున్న స్టార్క్.. టీ20ల నుంచి తప్పకోవాలని నిర్ణయించుకున్నాడు. 'టెస్టులే నా మొదటి ప్రాధాన్యత. టీ20లలో నేను ఆడిన ప్రతి క్షణాన్నీ ఆస్వాదించాను. ముఖ్యంగా 2021 టీ20 వరల్డ్ కప్. ఆ టోర్నీలో టైటిల్ గెలవడం కంటే గ్రూపుగా మేం చాలా ఎంజాయ్ చేశాం' అని స్టార్క్ చెప్పాడు. ఈ ఫార్మాట్‌లో స్టార్క్ చివరిసారిగా 2024 టీ20 వరల్డ్ కప్‌లో ఆడాడు. సుదీర్ఘ కెరీర్‌లో స్టార్క్ ఐదు టీ20 ప్రపంచకప్‌లు ఆడాడు.

## కాత్యాయనిగా అలరిస్తా



'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' తర్వాత కొన్ని ఆఫర్లు వచ్చాయి. కానీ సెలక్టివ్‌గా వెళ్లాలని వెయిట్ చేశా. మంచి కంటెంట్ ఉన్న కథ కోసం ఎదురు చూస్తున్నప్పుడు 'లిటిల్ హార్ట్స్' ప్రాజెక్ట్ నా దగ్గరకొచ్చింది. డైరెక్టర్ సాయిమార్తాండ్ ఈ కథ చెప్పినప్పుడు ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ప్రతి పాత్రనూ డిజైన్ చేసిన తీరు సూపర్. నా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'లో లవ్‌స్టోరీతోపాటు ఎమోషనల్ కంటెంట్ ఉంటుంది. ఈ సినిమా అలా కాదు. ఇది కంప్లీట్ లైట్ హార్టెడ్ మూవీ. కాలేజీ రోజుల్లో ఉండే ఫన్‌తో ఈ సినిమా సాగుతుంది. యూత్‌కి విపరీతంగా నచ్చే సినిమా ఇది.' అని శివాని నాగరం అన్నారు. మౌళి తనుజ్, శివాని నాగరం జంటగా నటించిన యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ 'లిటిల్ హార్ట్స్'. సాయిమార్తాండ్ దర్శకుడు. ఆదిత్య హాసన్ నిర్మాత. బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వారా ఈ చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా కథానాయిక శివాని నాగరం మంగళవారం విలేకరులతో ముచ్చటించారు. 'ఇందులో నా పేరు 'కాత్యాయని'. ప్రతి అమ్మాయి తమతో తాము పోల్చుకునేలా నా పాత్ర ఉంటుంది. అఖిల్, కాత్యాయని స్నేహం, ప్రేమ.. ప్రతి ఒక్కరి కాలేజ్ రోజుల్ని గుర్తు చేస్తుంది. ఈ సినిమా థియేటర్‌కోసం చేసిందే అయినా.. బన్నీ వాస్, వంశీ నందిపాటి ఎంటర్ అయ్యాక, సినిమా రేంజ్ మారింది. ఈటీవీ విన్ రిలీజ్ చేస్తున్న తొలి థియేట్రికల్ ఫిల్మ్ ఇదే కావడం విశేషం' అని తెలిపారు శివాని నాగరం.



## కిరణ్ అబ్బవరం బాలీవుడ్ ఎంట్రీ?

గత ఏడాది 'క' చిత్రంతో కెరీర్‌లోనే భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు యువ హీరో కిరణ్ అబ్బవరం. ప్రస్తుతం ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..'మిర్జాపూర్' సిరీస్‌తో ప్రతిభావంతుడైన దర్శకుడిగా గుర్తింపును తెచ్చుకున్నారు ఆనంద్ అయ్యర్. తాజాగా ఆయన ఓ పాన్ ఇండియా చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయమై సంప్రదింపులు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని అంటున్నారు. కిరణ్ అబ్బవరం ప్రస్తుతం కే ర్యాంప్, చెన్నై లవ్‌స్టోరీ చిత్రాల్లో నటిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్ సంస్థలో ఓ సినిమా ఖరారైందని తెలిసింది. 'క' సినిమా ద్వారా వచ్చిన గుర్తింపు వల్లే కిరణ్ అబ్బవరం బాలీవుడ్ దర్శకుడి దృష్టిలో పడ్డారని, ఒకవేళ ఈ ప్రాజెక్ట్ నిజమైతే ఆయన కెరీర్‌లో మరో మెట్టెక్కడం ఖాయమని ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నది.

## కవితకు మంత్రి పదవి దక్కితే మనకే మంచిదన్న కేసీఆర్



బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేస్తూ తీసుకున్న కఠిన నిర్ణయం వెనుక తీవ్రమైన అంతర్మథనం, పక్కా రాజకీయ వ్యూహం ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఈ నిర్ణయం తీసుకునే ముందు ఫామ్‌హౌస్‌లో ముఖ్య నేతలతో సమావేశమైన పార్టీ అధినేత కేసీఆర్ తన కుమార్తె వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి, ఆవేదన వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది."కవితకు నేనేం తక్కువ చేశాను నిజామాబాద్ ఎంపీగా, ఆ తర్వాత ఎమ్మెల్సీగా అవకాశమిచ్చాను. మద్యం కేసులో చిక్కుకున్నప్పుడు పెద్ద పెద్ద లాయర్లను పెట్టి పోరాడాను. అయినా ఆమె ఎందుకిలా పార్టీకి నష్టం కలిగించేలా ప్రవర్తించింది అని కేసీఆర్ తన సన్నిహితుల వద్ద వాపోయినట్టు సమాచారం.ఈ సమావేశంలో కొందరు సీనియర్ నేతలు మాట్లాడుతూ కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టచ్‌లో ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకే నడుచుకుంటున్నారని ఆరోపించినట్టు తెలిసింది. దీనికి సంబంధించి తమ వద్ద కొన్ని ఆధారాలు కూడా ఉన్నాయని వారు కేసీఆర్‌కు వివరించినట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కవితపై వేటు వేయకపోతే పార్టీలో క్రమశిక్షణ లోపిస్తుందని, చాలామంది నేతలు సొంత అజెండాతో ముందుకు వెళ్లే ప్రమాదం ఉందని అభిప్రాయపడినట్టు తెలిసింది.సస్పెన్షన్ తర్వాత కవిత భవిష్యత్ కార్యాచరణపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగినట్టు సమాచారం. ఆమె కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని, ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఆమెకు మంత్రి పదవి కూడా ఇవ్వొచ్చని కొందరు నేతలు అంచనా వేశారు. దీనిపై కేసీఆర్ స్పందిస్తూ "ఒకవేళ ఆమెకు మంత్రి పదవి వస్తే అది రాజకీయంగా మనకే లాభం చేకూరుస్తుంది" అని వ్యాఖ్యానించినట్టు సమాచారం.కుమార్తె విషయంలో కఠినంగా వ్యవహరించడం ద్వారా పార్టీయే తనకు కుటుంబమని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని కేసీఆర్ గట్టి సందేశం పంపినట్టయింది. నేతలందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే పార్టీ ప్రయోజనాల దృష్ట్యా కవితపై వేటు వేయాలన్న తుది నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్టు తెలుస్తోంది.




## నితీశ్ వ్యవహరించిన తీరు అద్భుతం: అశ్విన్

ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఎక్కువగా గొడవలు జరుగుతుంటాయి. సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్, వెస్ట్ ఢిల్లీ లయన్స్ జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరిగింది. నితీశ్ రానా- దిగ్వేష్ రాఠీ మధ్య వివాదం జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ మ్యాచ్‌తో పాటు ఫైనల్‌లో నితీశ్ జట్టు వెస్ట్ ఢిల్లీ లయన్స్ విజయం సాధించింది. దిగ్వేశ్ వాగ్వాదంపై నితీశ్ వ్యవహరించిన తీరుపై భారత మాజీ క్రికెటర రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసించారు. డిపిఎల్‌లో నితీశ్-దిగ్వేశ్ మధ్య జరిగిన గొడవ స్పిన్నర్‌దే తప్పు జరిగి ఉండొచ్చని, కానీ నితీశ్ వ్యవహరించిన తీరు క్రీడాస్ఫూర్తికి మంచిదేనన్నాడు. ఈ మ్యాచ్‌లో నితీశ్ 15 సిక్స్‌లు కొట్టాడు, సెంచరీ బాది తన జట్టును గెలిపించాడని, ఇద్దరు జట్టు విజయం కోసం ఆడామని, పరిస్థితి హాట్‌గా ఉన్నప్పుడు మ్యాచ్‌కు మంచిదేనన్నాడు. దిగ్వేష్‌పై బురద చల్లకపోవడం క్రీడాస్ఫూర్తిని రగిలించిందని, సహచర ఆటగాళ్ల క్యారెక్టర్‌ను తక్కువ చేయకూడదని అశ్విన్ తెలియజేశారు.

### కవితను పార్టీలో చేర్చుకునేది లేదన్న


## తెలంగాణ బీజేపీ చీఫ్



బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను భారతీయ జనతా పార్టీలో చేర్చుకునే ప్రసక్తే లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు స్పష్టం చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి తమ పార్టీలో ఎలాంటి స్థానం ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని, త్వరలోనే ఆ పార్టీలోని ఇతర నేతలు కూడా కారు దిగిపోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.నిన్న నల్లగొండ జిల్లా గుండ్రాంపల్లిలో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమంలో రాంచందర్‌రావు పాల్గొన్నారు. అమరవీరుల కుటుంబాలను సన్మానించిన అనంతరం ఆయన మాట్లాడారు. దోచుకున్న సొమ్ము పంపకాల విషయంలో తేడాలు రావడంతోనే కేసీఆర్ కుటుంబంలో గొడవలు మొదలయ్యాయని, వారి కుటుంబ పంచాయితీ ఇప్పుడు రోడ్డున పడిందని ఆరోపించారు. కవిత చేసిన వ్యాఖ్యలతో బీఆర్ఎస్‌లో జరిగిన అవినీతి బట్టబయలైందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంపైనా రాంచందర్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణను 20 నెలలుగా ఆలస్యం చేస్తోందని, దీనివల్ల నిందితులు ఆధారాలు తారుమారు చేసేందుకు అవకాశం దొరికిందని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకరినొకరు కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ జాప్యం జరుగుతోందని ఆరోపించారు.

### రీల్స్ చేస్తుందని భార్యను చంపేసి..

## భర్త పాయిజన్ తాగి ఉరేసుకొని



యూట్యూబ్‌లో రీల్స్ చేస్తుదని భార్యను చంపి భర్త ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ సంఘటన ఢిల్లీలోని నజఫ్‌గఢ్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం_ _ _ ఓల్డ్ రోషన్‌పూర్ ప్రాంతంలో అమన్(35) అనే వ్యక్తి తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. అమన్ భార్య యూట్యూబ్‌లో రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంది. ఆమెకు ఇన్ స్టాగ్రామ్‌లో ఆరు వేల ఫాలోవర్స్ ఉన్నారు. పలుమార్లు భర్త రీల్స్ చేయవద్దని భార్యను హెచ్చరించాడు. భర్త మాటలను పట్టించుకోకుండా రీల్స్ చేస్తుండడంతో ఇద్దరు మధ్య గొడవ జరిగింది. ఘర్షణ తారాస్థాయికి చేరుకోవడంతో కోపంలో ఆమెను చంపేసి అనంతరం అమన్ పాయిజన్ తాగాడు. అనంతరం ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి వెంటనే అతడిని ఆర్‌టిఆర్ఎం ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఉత్తర ప్రదేశ్‌లోని పిలిభిత్‌కు చెందిన ఈ దంపతులు నాలుగు నెలల క్రితం నజఫ్‌గఢ్‌కు మారారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.